## అక్రమ మైనింగ్ తక్షణమే ఆపండి

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, మే 19: జిల్లాలో అక్రమ మైనింగ్‌ను తక్షణమే ఆపి, ప్రజా సంపదను కాపాడాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. మెట్‌పల్లి-కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై మేడిపల్లి శివారులో రాత్రింబవళ్లు మట్టిని అక్రమంగా తరలిస్తూ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కొందరు లూటీ చేస్తున్నారని తెలిపారు. తక్షణమే మైనింగ్ ఆపి, ప్రజల సంపదను కాపాడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరారు. కాంగ్రెస్ అంటేనే అక్రమార్కులకు కేరాఫ్ అని మండిపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిస్తే ఆ పార్టీ నాయకులకే లాభమని.. బీఆర్ఎస్ గెలిస్తే ప్రజలకు లాభమని ముందే చెప్పామని గుర్తుచేశారు.






# 476 రిజిస్ట్రేషన్లు రద్దు!

- నిషేధిత జాబితాలో 175, 197, 198 సర్వే నంబర్లు
- సీలింగ్ భూముల్లో లావాదేవీలపై లోకాయుక్త కన్నెర్ర
- రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కరీంనగర్ కలెక్టర్ ఆదేశాలు
- నాలుగు రోజుల క్రితమే గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు నోటీసులు
- ఆందోళనలో కొనుగోలుదారులు

**కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 476 రిజిస్ట్రేషన్లు రద్దు కానున్నాయి. ఈ మేరకు నాలుగు రోజుల క్రితమే గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు నోటీసులు అందాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో లావాదేవీలు నిర్వహిస్తుండడంతో లోకాయుక్త సీరియస్ అయింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడం కలకలం రేపుతున్నది. సీలింగ్ భూముల విషయం తెలియక లక్షలాది రూపాయలు వెచ్చించి భూములు కొన్న వారు, ఇప్పుడు రోడ్డున పడే పరిస్థితి వచ్చింది.**

గంగాధర, మే 19 : కరీంనగర్ జిల్లా కొత్తపల్లి రెవెన్యూ పరిధిలోని 175, 197, 198 సర్వే నంబర్లలో సుమారు 20 ఎకరాల భూమి ఉన్నది. దీనిపై 30 ఏండ్ల నుంచి సీలింగ్ యాక్ట్ అమలులో ఉన్నది. ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు జరపరాదని హైకోర్టు ఆర్డర్ ఉన్నది. కానీ, పదిహేనేండ్ల కాలంలో 175లో 3, 197లో 291, 198లో 182 రిజిస్ట్రేషన్లు జరిగాయి. దీంతో 2016 ఆగస్టు 23న సదరు సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చాలని కలెక్టర్ కార్యాలయం నుంచి అప్పటి కరీంనగర్‌రూరల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు నోటీసులు అందాయి. అప్పటి వరకు (2018) కరీంనగర్ రూరల్ పరిధిలో ఉన్న కొత్తపల్లి మండలాన్ని గంగాధర సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు మార్చారు. కానీ, అప్పటికే 424 రిజిస్ట్రేషన్లు చేశారు. 2018 తర్వాతి నుంచి 2024 వరకు గంగాధర పరిధిలో 52 రిజిస్ట్రేషన్లు చేశారు. అందులో ఒకటి మాత్రమే లోకాయుక్త ఆదేశాల మేరకు జరిగినట్టు తెలిసింది. కాగా, కొత్తపల్లి భూముల క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లపై లోక్‌సత్తా నాయకులు పోరాటం చేస్తూ వచ్చారు. ఆ మూడు సర్వే నంబర్లపై 1995లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ జరపాలని అప్పటి కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్ విచారణ జరిపి సదరు సర్వే నంబర్లలోని భూములు సీలింగ్ పరిధిలో ఉన్నట్టు హైకోర్టుకు నివేదిక అందించారు. దాని ప్రకారం సదరు భూములపై ఎలాంటి లావాదేవీలూ జరపొద్దని హైకోర్టు ఆదేశాల జారీ చేసింది. అదే సమయంలో కొంతమంది వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించగా, అప్పటి నుంచి విచారణ కొనసాగుతూనే ఉన్నది. కేసు పెండింగ్‌లో ఉండగానే కొందరు సదరు భూముల్లో అక్రమంగా లావాదేవీలు జరిపారు. దీనిని గుర్తించిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ 2015 లోకాయుక్తలో ఫిర్యాదు చేసింది. దాంతో విచారణ ప్రారంభించిన లోకాయుక్త, సదరు భూములపై పూర్తి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని, ఇక ముందు ఆ భూములపై ఎలాంటి లావాదేవీలూ జరపవద్దని రెవెన్యూ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. దాంతో అప్పటి వరకు జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలను జిల్లా రెవెన్యూ శాఖ లోకాయుక్తకు సమర్పించింది. సదరు భూముల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయద్దని రిజిస్ట్రేషన్ శాఖకు సూచించింది. అయితే, లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ చనిపోవడం, విచారణ ఆగిపోవడం కబ్జారాయుళ్లకు కలిసివచ్చింది. ఇదే అదునుగా రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న కొద్దిమంది అధికారుల సహకారంతో సీలింగ్ యాక్టును తొక్కిపెట్టి రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ క్రమంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల రిజిస్ట్రేన్లు జరుగుతున్న విషయం లోకాయుక్త దృష్టికి వెళ్లడంతో తిరిగి విచారణ ప్రారంభించింది. కొత్తపల్లి పరిధిలోని 175,197,198 సర్వే నంబర్ల భూములకు సంబంధించి లావాదేవీలు జరపొద్దని 2024 నవంబర్ 14న ఆర్డీవో రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ రాశారు. అయినా, రిజిస్ట్రేషన్ శాఖ ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో ఆ విషయాన్ని లోకాయుక్తకు తెలిపారు. దీంతో ఆగ్రహించిన లోకాయుక్త తక్షణమే చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్‌కు సూచించింది. ఆ మేరకు కలెక్టర్ పమేలా సత్పతి 175,197,198 సర్వే నంబర్లలో ఇప్పటి వరకు జరిగిన 476 రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని రిజిస్ట్రేషన్ శాఖకు గత శుక్రవారమే ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయా సర్వే నంబర్లలో జరిగిన 476 రిజిస్ట్రేషన్లు రద్దు కానున్నాయి. కాగా, సీలింగ్ భూముల విషయం తెలియక భూములు కొన్న కుటుంబాలు రోడ్డున పడనున్నాయి. కాగా, సీలింగ్ భూములను విక్రయించిన అక్రమార్కులు, వారికి సహకరించిన అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకొని అమాయక ప్రజలకు న్యాయం చేయాలని పేదలు వేడుకుంటున్నారు. దీనిపై సబ్ రిజిస్ట్రార్ అబ్జల్‌నూర్‌ఖాన్‌ను సంప్రదించగా, కలెక్టర్ నుంచి నోటీసులు అందాయని చెప్పారు. పై అధికారుల ఆదేశాల మేరకు సర్వే నంబర్లు 175,197,198 జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేస్తామని తెలిపారు.



మల్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పార్టీ నాయకులు

# రేవంత్‌కు కేసీఆర్‌ను తిట్టుడే పని

- అభివృద్ధిని మరిచిపోయిండు • ఆరు గ్యారెంటీల ఊసే లేదు • 'కాళేశ్వరం' నిజాలు వివరిస్తాం • త్వరలో సదస్సు ఏర్పాటు చేస్తాం • కొండగట్టు ఆలయ అభివృద్ధిపై ఎంపీ, ఎమ్మెల్యే దృష్టిసారించాలి • కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మల్యాల/ కొడిమ్యాల, మే 19 : సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధిని మరిచిపోయాడని, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. రేవంత్ పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందక రాష్ట్రం అధోగతి పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై త్వరలో సదస్సు నిర్వహించి నిజాలను ప్రజలకు వివరిస్తామని స్పష్టం చేశారు. కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలోని బృందావన్ రిసార్ట్ వేదికగా కాంగ్రెస్, బీజేపీ నుంచి కొండాపూర్‌కు చెందిన కందుల రమణారెడ్డి, గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏడెల్లి పరశురాములుతోపాటు పలువురు యువకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వినోద్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో బూతులు మాట్లాడే వారిలో సీఎం రేవంత్‌రెడ్డి దేశంలోనే ముందున్నారని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా దాటవేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. స్థానిక ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే సత్యం కొండగట్టు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో కల్లాల్లో ధాన్యం తడుస్తుంటే పట్టించుకునే నాదుడే కరువయ్యాడని, రైతుల సన్న వడ్లకు బోనస్ లేదని, రైతు బంధు రావడం లేదని, రుణమాఫీ కాలేదని తెలిపారు.

### 333 ఎకరాలకు విస్తరించాం

గతంలో ఆంజనేయస్వామి ఆలయానికి 5.30 ఎకరాలు మాత్రమే ఉండేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాము 333 ఎకరాల రెవెన్యూ భూమిని దేవాదాయశాఖకు బదిలీ చేసి విస్తరించినట్టు వినోద్‌కుమార్ తెలిపారు. ఆలయాల అభివృద్ధి విషయంలో ప్రత్యేక కృషి చేశామని, ప్రస్తుతం పదవిలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. దేశంలో ఎన్నో ఆలయాలు ఉన్నప్పటికీ అన్నింటికంటే శక్తివంతమైన, పురాతమైనది కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయమని, ఎంతోమందిని దీక్షాపరులుగా ఆకర్షించే శక్తి ఆంజనేయస్వామికే ఉన్నదని చెప్పారు. ఏటా రెండు జయంతులను నిర్వహించే ఏకైక ఆలయం కొండగట్టు అని, ఎంతోమంది నియమ నిష్ఠలతో దీక్షను కొనసాగిస్తూ దూరాన్ని సైతం లెక్కచేయకుండా కాలినడకన ఆలయానికి వస్తున్నారని తెలిపారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించే బాధ్యత ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదని చెప్పారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ మహిమాన్విత ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక కృషి చేసి ₹1000 కోట్లు ప్రకటించి, తదనుగుణంగా ₹500 కోట్లకు ప్రణాళికలను సైతం రూపొందించామన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రతిపాదనలను అమలు పరచడం లేదన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్‌పర్సన్‌లు తుల ఉమ, దావ వసంత, మాజీ జడ్పీటీసీలు రాంమోహన్‌రావు, ప్రశాంతి, బీఆర్ఎస్ నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, పునుగోటి కృష్ణారావు, పులి వెంకటేశంగౌడ్, గాడిచర్ల శ్రీకాంత్‌రెడ్డి, బద్దం తిరుపతిరెడ్డి, జనగం శ్రీనివాస్, నరేంధర్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, బాలగౌడ్, మధుసూదన్‌రావు, సాగర్ రావు, అశోక్, లింగాగౌడ్, కొండయ్య, చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

### నిధుల రద్దును విరమించుకోవాలి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అంజన్న ఆలయంలో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాం. ఈ క్రమంలో కొండపైన నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి వరదకాలువకు ఆనుకొని ప్రత్యేకంగా పంప్‌హౌస్ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాం. అక్కడి నుంచి సంతలోనిలొద్దిని ప్రత్యేక రిజార్వాయర్‌గా మార్చి కొండపైకి తీసుకువచ్చేందుకు పనులను ప్రారంభించాం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంప్‌హౌస్ నిర్మాణానికి నిధులు కుదించడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ విషయమై అధికార యంత్రాంగం ఇంజినీరింగ్ బృంద సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యాం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృషి చేసి నిధుల రద్దును రాష్ట్ర ప్రభుత్వం విరమించుకునేలా చేయాలి. పంప్‌హౌస్ నిర్మాణం యధావిధిగా చేపట్టేలా బాధ్యత వహించాలి.

**- బోయినపల్లి వినోద్ కుమార్**



రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో పరిశీలనకు వచ్చిన దరఖాస్తుదారులు (ఫైల్)

# ఆఫ్‌లైన్ దరఖాస్తులెక్కడ ?

- రాజీవ్ యువ వికాసంలో గందరగోళం
- పెద్దపల్లి జిల్లాలో ఆన్‌లైన్ అర్జీలు 46,926
- ఆఫ్‌లైన్‌లో వెయ్యికి పైగా..
- వెరిఫికేషన్ పూర్తి చేసిన బ్యాంకర్లు
- ఆన్‌లైన్ దరఖాస్తులే పరిగణలోకి
- జూన్ ఒకటిలోగా మంజూరు చేస్తామన్న అధికారులు
- ఆందోళనలో ఆఫ్‌లైన్ ధరఖాస్తుదారులు

**రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్‌కు చెందిన ఓ యువకుడు రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా ₹2 లక్షల యూనిట్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే, ఆన్‌లైన్‌లో పని చేయకపోవడంతో గడువు పొడిగించిన తర్వాత ఆఫ్‌లైన్‌లో సమర్పించాడు. అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు సైతం పిలుపు రావడంతో బ్యాంకర్లకు తాను దరఖాస్తు చేసుకున్న యూనిట్ గురించి వివరించాడు. బ్యాంకర్ సైతం రుణం ఇచ్చేందుకు ఓకే అన్నాడు. క్రెడిట్ స్కోర్, బ్యాంక్ ట్రాన్సాక్షన్ చూసిన బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్.. కార్పొరేషన్ నుంచి వచ్చిన జాబితాలో పేరు లేదని చెప్పడంతో ఆందోళనలో చెందాడు ఇదేంటని కార్పొరేషన్ అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాళ్లవి మాత్రమే పంపించామని చెప్పడంతో అవాక్కయ్యాడు. ఒక్క ఈ యువకుడే కాదు.. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వందలాది మంది పరిస్థితి ఇలాగే మారింది.**

పెద్దపల్లి, మే 19(నమస్తే తెలంగాణ): రాజీవ్ యువ వికాస్ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 14లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. అయితే, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధం కాగా, వరుస సెలవులు రావడంతో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాలేదు. ఏప్రిల్ 14 తర్వాత ఆన్‌లైన్ పనిచేయకపోవడంతో ప్రభుత్వం అదే నెల 24వ తేదీ వరకు ఆఫ్‌లైన్ ద్వారా స్వీకరించింది. దీంతో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతోపాటు ఆయా మండలాల ఎంపీడీఓ కార్యాలయాల్లో వందల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. తీరా చూస్తే ప్రభుత్వం ఆన్‌లైన్ దరఖాస్తుదారుల సంఖ్య మాత్రమే చెబుతున్నది. ఆఫ్‌లైన్ లెక్కలు చెప్పకపోవడంపై అనుమానాలకు తావిస్తున్నది. ఒక్క పెద్దపల్లి జిల్లాలోనే ఆఫ్‌లైన్‌లో వెయ్యికి పైగా వచ్చిన దరఖాస్తుల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. జూన్ ఒకటి కల్లా యూనిట్ల మంజూరు పత్రాలను సిద్ధం చేయాలని అధికారులు చెప్పడంతో ఆఫ్‌లైన్ దరఖాస్తుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### పరిశీలన కోసమే పిలుపు

ఆఫ్‌లైన్ దరఖాస్తులను సైతం పరిగణలోకి తీసుకుంటున్నామనే నమ్మకం కలిగేలా అధికారులు జిల్లాలో నిర్వహించిన దరఖాస్తుల పరిశీలనకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వారందరినీ పిలిచారు. దీంతో ఆఫ్‌లైన్ దరఖాస్తుదారులకు ఎలాంటి అనుమానం రాలేదు. తాజాగా ఒక్కో దరఖాస్తుదారుడికి తాము పెట్టుకున్న బ్యాంకు నుంచి పిలుపు వచ్చింది. వారి సిబిల్ స్కోర్, ఇతర బ్యాంకు లావాదేవీలను పరిగణలోకి తీసుకొని ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఈ సమయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి పిలుపు రాలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా దాదాపుగా వెయ్యి మంది వరకు నష్టపోయే ప్రమాదం ఏర్పడగా, దరఖాస్తు చేసుకున్న వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందే స్పష్టత ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెబుతున్నారు.

# గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

- రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- బొమ్మారెడ్డిపల్లిలో పరామర్శ




బాధిత గొర్రెల పెంపకందారులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

ధర్మారం, మే 19 : బొమ్మారెడ్డిపల్లిలో మరణించిన గొర్రెలకు కలెక్టర్ ప్రత్యేక నిధి ద్వారా పరిహారం చెల్లించాలని, బాధిత గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ కోరారు. గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల పెంపకందారులకు చెందిన 96 గొర్రెలు ఇప్పటికే మృతి చెందగా, సోమవారం మరో ఏడు గొర్రెలు మరణించాయి. సమాచారం తెలుసుకున్న కొప్పుల ఈశ్వర్ సోమవారం ఆ గ్రామానికి వెళ్లి గొర్రెల పెంపకం దారులను పరామర్శించారు. గొర్రెల మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వందకు పైగా గొర్రెలు మేతకు వెళ్లి విషాహారం తిని మరణించడం బాధాకరమన్నారు. మూగజీవాల మృతి వల్ల గొర్రెల పెంపకందారులకు తీవ్రమైన నష్టం వచ్చిందన్నారు. వారు ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక గొర్రెల పథకం ప్రస్తుతం లేనందున కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి తన నిధి ద్వారా పరిహారం చెల్లిస్తేనే నష్టపోయిన బాధిత గొర్రెల పెంపకందారులకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రత్యేక గొర్రెల పథకం ఉండడం వలన ప్రమాదవశాత్తు సామూహికంగా పెద్ద సంఖ్యలో మరణిస్తే గొర్రెల స్థానంలో తిరిగి వారికి తమ ప్రభుత్వం ఇచ్చేదని అన్నారు. కలెక్టర్ మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు. కొప్పుల వెంట నంది మేడారం ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాచూరి శ్రీధర్, నాయకులు పూస్కూరు రామారావు, గుర్రం మోహన్‌రెడ్డి, గాగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి,దాడి సదయ్య, మిట్ట తిరుపతి, ఎగ్గెల స్వామి, గడ్డం మహిపాల్‌రెడ్డి, సంకరి నర్సింగం, పాక వెంకటేశం, ఆవుల లత, దేవి నళినీకాంత్, దేవి వంశీక్రిష్ణ, ఆవుల వేణు,ఐత వెంకటస్వామి,అజ్మీర మల్లేశం పాల్గొన్నారు.

# 21 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

- అండర్ 25 విభాగంలో ప్రారంభం
- విడుతల వారీగా నాలుగు విభాగాల్లో నిర్వహణ
- క్రికెట్ సంఘ జిల్లా అధ్యక్షుడు వీ ఆగంరావు



పోటీల వివరాలు వెల్లడిస్తున్న ఉమ్మడి జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగం రావు

కొత్తపల్లి, మే 19 : ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు వీ ఆగం రావు తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆరు క్రికెట్ జట్లను ఎంపిక చేశామని, అండర్-25 విభాగంలో మొదట లీగ్ పద్ధతిలో పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎక్కువ పాయింట్లు సాధించిన నాలుగు జట్లు సెమీ ఫైనల్‌కు ప్రవేశిస్తాయని తెలిపారు. ఫైనల్‌కు చేరిన ఇరు జట్లకు మ్యాచ్ నిర్వహించి విజేతను ఎంపిక చేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జూన్‌లో హైదరాబాద్‌లో జరిగే హెచ్‌సీఏ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని, ఆ జట్టు ఉమ్మడి జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ పోటీల్లో కరీంనగర్ నుంచి రెండు జట్లు, వేములవాడ నుంచి ఒకటి, జగిత్యాల నుంచి ఒకటి, గోదావరిఖని నుంచి ఒకటి పాల్గొంటాయన్నారు. అలాగే, అండర్-19, అండర్-16, అండర్-14 విభాగాల్లోనూ ఆరు జట్ల చొప్పున ఎంపిక చేశామని, వీటికి విడుతల వారీగా పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌సీఏ సౌజన్యంతో నిర్వహిస్తున్న అండర్-25 క్రికెట్ లీగ్ పోటీలను మొదట కరీంనగర్‌లోని సెయింట్ ఆల్ఫోన్స్ మైదానంలో ప్రారంభిస్తామని, శాతవాహన యూనివర్సిటీ మైదానం, వేములవాడలో పోటీలు జరుగుతాయని, ఈ నెల 21 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉంటాయని తెలిపారు. మొత్తం 15 లీగ్ మ్యాచ్‌లు, ఒక ఫైనల్ మ్యాచ్ ఉంటాయన్నారు. ఇరు జట్లు మొదటి రోజు 50 ఓవర్ల చొప్పున ఒక ఇన్నింగ్స్‌ను, రెండో రోజు 40 ఓవర్ల చొప్పున ఒక ఇన్నింగ్స్ ఆడతాయన్నారు. ఈ పోటీలను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించేందుకు హెచ్‌సీఏ అవకాశం కల్పించిందన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా క్రికెటర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్ మురళీధర్‌రావు, ఉపాధ్యక్షుడు కే మహేందర్‌గౌడ్, సంఘ సభ్యులు అజిత్ కుమార్, హరికృష్ణ గౌడ్ పాల్గొన్నారు.